ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 27 నవంబరు 2025



విజయపథంలో సాగాలని..

● శతశాతం లక్ష్యం.. నిరంతర అధ్యయనం
● పరీక్షలకు సిద్ధమవుతున్న కస్తూర్బా బాలికలు

6లో





ఆలయాలకు మహర్దశ

● ఎండల మల్లన్న, కొత్తమ్మతల్లి దేవస్థానాలకు నిధులు
● రెండింటికి రూ.6.40కోట్లు కేటాయించిన ప్రభుత్వం
● ఫలించిన మంత్రి అచ్చెన్నాయుడు కృషి

శ్రీకాకుళం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎండల మల్లన్న, కొత్తమ్మతల్లి ఆలయాలకు మహర్దశ పట్టింది. ఈ రెండు ఆలయాల అభివృద్ధికి కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్)కింద ప్రభుత్వం భారీగా నిధులను కేటాయించింది. టెక్కలి మండలం రావివలసలోని ఎండల మల్లికార్జున స్వామి ఆలయానికి రూ.2.40 కోట్లు, కోటబొమ్మాళి మండలంలోని కొత్తమ్మతల్లి ఆలయానికి రూ.4 కోట్లు మొత్తం రూ.6.40కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఈ ఆలయాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ బుధవారం ఉత్తర్వులను జారీచేశారు. కాగా, ఈ ఆలయాల అభివృద్ధికి ఇప్పటికే అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి (మిగతా 6వ పేజీలో..)

నిధులున్నా.. పనులు చేయట్లే!

● జిల్లాలో 'నత్తనడకన' పీఎం జన్‌మన్
● పూర్తికాని గిరిజనుల గృహాలు
● తొమ్మిది శాతం కూడా దాటని ప్రగతి
● చాలాచోట్ల పునాది స్థాయిలోనే..

శ్రీకాకుళం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎం జన్‌మన్ పథకం కింద మంజూరైన ఇళ్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధులున్నా క్షేత్రస్థాయిలో పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. చాలా చోట్ల పునాది దశ కూడా దాటలేదు. దీంతో గిరిజనుల సొంతింటి కల నెరవేరని పరిస్థితి ఏర్పడింది. తాజాగా వెల్లడైన అధికారిక నివేదికే ఇందుకు సాక్ష్యం.



మందస మండలంలో ఇళ్ల పరిస్థితి..

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో ప్రధానమంత్రి జన్జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్) పథకం కింద గిరిజనులకు 1,565 ఇళ్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి రూ.37.40 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కానీ, ఇప్పటివరకు కేవలం 129 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. ఈ పథకం ప్రారంభమై ఇన్నాళ్లవుతున్నా కనీసం 9 శాతం ఇళ్లు కూడా పూర్తి కాలేదంటే యంత్రాంగం పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. 770 ఇళ్లు (సుమారు యాభై శాతం) ఇంకా ప్రారంభ దశలోనే (నాట్ స్టార్టడ్-ఎన్ఎస్) ఉన్నాయి. పలాస నియోజకవర్గంలో 195 ఇళ్లు మంజూరైతే ఇప్పటివరకు పూర్తయింది కేవలం రెండు గృహాలు మాత్రమే. అంటే 1 శాతం ప్రగతి కూడా లేదు. టెక్కలి నియోజకవర్గంలో పరిస్థితి మరీ ఘోరం. 48 ఇళ్లు మంజూరైతే ఇప్పటివరకు (మిగతా 6వ పేజీలో..)

ఎందుకు రాలేదో మరి!

● అంబేడ్కర్ వర్సిటీ పరిపాలనా భవనం ప్రారంభం
● హాజరుకాని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు



వర్సిటీలో పరిపాలనా భవనాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని

ఎచ్చెర్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో బుధవారం రూ.36 కోట్లతో నిర్మించిన నూతన పరిపాలనా భవన ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరు కాలేదు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులను వర్సిటీ అధికారులు ఆహ్వానించినా ఒక్కరు కూడా రాకపోవడం చర్చనీయాంశం అయింది. అయితే వర్సిటీ అధికారులు కూడా.. ప్రజాప్రతినిధులు లేకుండానే ప్రారంభించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వసతి సమస్య పరిష్కారం: వీసీ రజని

బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో పాలనాపరమైన వసతి సమస్య దాదాపుగా పరిష్కారమైందని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. రూ.36 కోట్లతో నిర్మించిన పరిపాలనా భవనాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రోటోకాల్ విషయమై కొన్ని అభ్యంతరాలు వ్యక్తమైనా అవన్నీ సమసిపోయాయన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాళ్లు ఎం.అనూరాధ, కె.స్వప్నవాహిని, సీహెచ్ రాజశేఖరరావు, ఆర్ అండ్ డీ డీన్ ఎన్.లోకేశ్వరి, ఎస్‌వో డాక్టర్ కె.సామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్ష ముగించుకుని

ఇంటికి వస్తుండగా..

● రామేశ్వరం వద్ద రోడ్డు ప్రమాదం
● ఇద్దరు పలాస యువకుల మృతి
● నలుగురికి గాయాలు



నవీన్‌కుమార్(ఫైల్)



సాయికుమార్(ఫైల్)

పలాస/రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం రామేశ్వరం వద్ద బుధవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పలాస మండలానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వీరంతా అయ్యప్ప దీక్షను విరమించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వీరరామచంద్రపురం గ్రామానికి చెందిన పైడి సాయికుమార్(24), పెదంచల గ్రామానికి చెందిన ఇల్లాకుల నవీన్‌కుమార్(23)తో పాటు పైడి తారకేశ్వరరావు, పైడి గణపతి, తమ్మినాన గణేష్, గుంట రాజు అయ్యప్ప మాలలు వేశారు. ఈ నెల 22న సాయికుమార్‌కు చెందిన కారులో వీరంతా శబరిమలై వెళ్లారు. అక్కడ అయ్యప్ప స్వామిని దర్శించుకుని దీక్షను విరమించారు. మంగళవారం రామేశ్వరం వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం కారులో పలాస బయలుదేరారు. బుధవారం వేకువజామున 4 గంటల ప్రాంతంలో పొగమంచు కారణంగా రోడ్డు కనిపించకపోవడంతో వీరు ప్రయాణిస్తున్న వాహనం ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు డ్రైవింగ్ సీటులో ఉన్న సాయికుమార్, నవీన్ అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని జాతీయ రహదారి అంబులెన్స్‌లో ఆ ప్రాంతంలో ఉన్న రామచంద్రపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో గుంట రాజుతో మరొక వ్యక్తి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. విషయం తెలుసుకున్న గ్రామస్థులతో పాటు మృతుల తల్లిదండ్రులు హుటాహుటిన రామేశ్వరం బయలుదేరి వెళ్లారు. ఎమ్మెల్యే గౌతు శిరీష (మిగతా 6వ పేజీలో..)



నుజ్జయిన కారు

విలువలతో కూడిన విద్యను అందించాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ● ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉపాధ్యాయులకు సూచించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయం అందరికీ అందించడమే రాజ్యాంగ దినోత్సవం లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. ఎవరూ సెల్‌ఫోన్లకు బానిసలు కావద్దని సూచించారు. గరుడభద్ర జడ్పీ హైస్కూల్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో డీఈవో రవిబాబు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ పీఠిక చదువుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

జిల్లా న్యాయస్థానంలో..

శ్రీకాకుళం లీగల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయస్థానంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. న్యాయస్థానం పోర్టికోలో జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా రాజ్యాంగ పీఠికను చదవగా మిగిలిన న్యాయాధికారులు, కోర్టు సిబ్బంది అనుసరించారు. ఈ కార్యక్రమంలో 1, 3, 4, 7 కోర్టుల అదనపు జిల్లా న్యాయాధికారులు పి.భాస్కరరావు, వివేకానందశ్రీనివాస్, ఎస్.ఎం.ఫణికుమార్, తిరుమలరావు, పోక్సో న్యాయాధికారి నక్క సుజాత, జిల్లాన్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.అనురాగ్, అదనపు జూనియర్ న్యాయాధికారి జమృత బేగం తదితరులు పాల్గొన్నారు

గంజాయితో రైల్వేస్టేషన్‌కు..

● పట్టుకున్న పోలీసులు ● 29 కేజీలు స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

ఇచ్ఛాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి సూరత్‌కు గంజాయిని రవాణా చేసేందుకు ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 29 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ మీసాల చిన్నమనాయుడు విలేకరులకు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా పటాపూర్ గ్రామానికి చెందిన సంజుక్తదాస్ అనే మహిళ గుజరాత్ రాష్ట్రం సూరత్ పాండెసర్‌లో ఉండేది. ఈ సమయంలో తన భర్త స్నేహితుడైన గంజాయి వ్యాపారం చేసే రంజాన్ ప్రధాన్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. అదే విధంగా మరో గంజాయి వ్యాపారి సచిన గ్రామానికి చెందిన కునిపండాతో కూడా పరిచయం ఏర్పడింది. అయితే, సంజుక్తదాస్ భర్త చనిపోయిన తరువాత ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోవడంతో ఆమె గంజాయి వ్యాపారులైన రంజాన్‌ప్రధాన్, కునిపండాను కలిసి డబ్బు సాయం కోరింది. ఈ నేపథ్యంలో ముగ్గురూ కలిసి గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు పలుమార్లు ఒడిశాలో గంజాయిని కొనుగోలు చేసి (మిగతా 6వ పేజీలో..)

భక్తుల భద్రతకు పెద్దపీట

● వేంకటేశ్వరాలయంలో సమూల మార్పులు
● భారీ క్యూలైన్లు, బారికేడ్ల ఏర్పాటు

6లో

తుఫాన్ హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన

● ధాన్యాన్ని భద్రపరిచేందుకు పాట్లు

6లో

‘అదనం’ ఇవ్వాల్సిందే

● బస్తాకు 6 కిలోలు ఎక్కువ ఇస్తేనే అన్‌లోడింగ్
● లేదా ఈలింగ్, మార్జిన్ పేరిట డబ్బులు ఇస్తేనే..
● ధాన్యం రైతును డిమాండ్ చేసిన మిల్లరు

నరసన్నపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈ రైతు పేరు తంగి రవీంద్ర. కంబకాయి గ్రామం. ఈయన తాను పండించిన ధాన్యం బుధవారం కొనుగోలు కేంద్రానికి తీసుకుని వెళ్లాడు. అక్కడ ట్రక్ షీట్ తీసుకుని దేశవానిపేట వద్ద ఉన్న ఓ మిల్లుకు వెళ్లాడు. అయితే మిల్లర్ ధాన్యం పరిశీలించి ముక్కలవుతోందన్నాడు. ఈలింగ్ (ధాన్యం నుంచి బియ్యం) పేరిట రూ.1421, మార్జిన్ పేరిట మరో రూ.420 ఇస్తే ధాన్యం దించుకుంటానని తెగేసి చెప్పాడు. లేదా బస్తాకు అదనంగా ఆరు కిలోలు ఇవ్వాలని పట్టుబట్టాడు. ఈ విషయం ట్రక్ షీట్ వెనుక కూడా రాశాడు. అయితే అదనంగా ఇవ్వలేనని రైతు చెప్పడంతో.. మిల్లర్ ధాన్యం తీసుకోలేదు. అధికారులకు చెప్పినా వారు కూడా పట్టించుకోక పోవడంతో ఆ రైతు నిరాశతో వెనుదిరిగాడు. ఈ ఘటన బుధవారం నరసన్నపేటలో (మిగతా 6వ పేజీలో..)



తంగి రవీంద్ర, రైతు



దేశవానిపేట మిల్లు వద్ద అన్‌లోడింగ్ చేయకుండా ఉంచిన ధాన్యం లోడ్




మిల్లుకు వ్యాన్‌లో ధాన్యం తరలిస్తున్న దృశ్యం

మూడు గంటల్లోనే ధాన్యం డబ్బులు జమ

సంతబొమ్మాళి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మిల్లుకు ధాన్యం పంపిన మూడు గంటల్లోనే ఓ రైతు బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమయ్యాయి. మండలంలోని గోవిందపురం పంచాయతీ జొన్నలపాడు గ్రామానికి చెందిన మెండ త్రినాథరావు అనే రైతు బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో 50 క్వింటాల ధాన్యాన్ని నిమ్మాడ మిల్లుకు పంపించాడు. సాయంత్రం 4 గంటల సమయంలో అతని బ్యాంక్ ఖాతాలో రూ.94,750 జమైంది. దీంతో త్రినాథరావు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

బీసీ రుణాలు ఎప్పుడిస్తారో?

● దరఖాస్తులు సేకరించి ఎనిమిది నెలలవుతున్న వైనం
● ఇప్పటికీ మంజూరు కాకపోవడంతో ఆందోళన
● అభ్యర్థులకు తప్పని ఎదురుచూపు





పాతపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీసీ రుణాలు మంజూరైతే ఏదైనా వ్యాపారం చేసుకొని స్వయం ఉపాధి పొందుదామని భావిస్తున్న దరఖాస్తుదారులకు నిరాశే ఎదురవుతోంది. బీసీ కార్పొరేషన్ రుణాల కోసం వారు దరఖాస్తు చేసుకుని ఎనిమిది నెలలు కావస్తున్నా ఇంత వరకు రూపాయి కూడా మంజూరు కాలేదు. దీంతో వారు తీవ్ర నిరాశ చెందుతున్నారు. రుణాలు ఎప్పుడు మంజూరవుతాయా? అని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను స్వయం (మిగతా 6వ పేజీలో..)

విజయపథంలో సాగాలని..

- శతశాతం లక్ష్యం.. నిరంతర అధ్యయనం
- పరీక్షలకు సిద్ధమవుతున్న కస్తూర్బా బాలికలు



హిరమండలం కేజీబీవీలో ప్రత్యేక తరగతుల్లో భాగంగా చదువుతున్న విద్యార్థినులు

హిరమండలం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):

విద్యార్థి జీవితంలో కీలకమైనది పదో తరగతి. ఆ తరువాత ఇంటర్. ఒకవిధంగా చెప్పాలంటే వారి భవితకు పునాది పడేది ఇక్కడే. టెన్త్, ఇంటర్‌లో సరైన దిశా నిర్దేశం.. శిక్షణ అందితే వారి భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టింది. ముఖ్యంగా కస్తూర్బా పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచడం.. విద్యార్థినులను పరీక్షలకు సరిగా సంసిద్ధం చేయాలని సంకల్పించింది. దీని కోసం 'విజయపథం' అనే సూత్రాన్ని అమలు చేస్తున్నారు.

● అత్యధిక మార్కుల కోసం..

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో సమస్యలు పరిష్కరించి.. నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యం సాధించాలనే లక్ష్యంతో గత ఏడాది 100 రోజుల ప్రణాళికను రూపొందించారు. అందులో భాగంగా 'పంచతంత్ర' పథకాన్ని అమలు చేశారు. ఈ ప్రణాళిక సత్ఫలితాన్నిచ్చింది. దీంతో ఈ ఏడాది కూడా పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత.. అత్యధిక మార్కుల సాధనపై దృష్టి పెట్టారు. దీని కోసం 'విజయపథం' అనే కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది జూలై 15వ తేదీన ఈ పథకం ప్రారంభించారు. అప్పటి నుంచి అన్ని కస్తూర్బా పాఠశాలల్లో ఇబ్బంది లేకుండా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

కార్యాచరణ ఇలా..

- ప్రత్యేక తరగతుల నిర్వహణ.
- పరీక్షలు రాయించడం. ● పరీక్షల భయం పోగొట్టడం.
- ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం.
- అభ్యసన స్థాయిని పెంచేందుకు ప్రత్యేకశిక్షణ.
- అన్ని సబ్జెక్టులకు సంబంధించిన మెలకువలు నేర్పడం.

పక్కాగా పర్యవేక్షణ..

జిల్లాలో మొత్తం 25 కేజీబీవీలు ఉన్నాయి. వీటిలో 5,079 మంది విద్యార్థినులు చదువుతున్నారు. 'విజయపథం' ప్రణాళిక అమలులో భాగంగా ఉదయం 6.30గంటల నుంచే విద్యార్థినులను సన్నద్ధం చేస్తున్నారు. ప్రతి రోజు రాత్రి 10 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతులు, పరీక్షల నిర్వహణ తీరును జిల్లా స్థాయిలో జీసీడీవో పర్యవేక్షిస్తున్నారు.

● ప్రతి సోమవారం స్టడీ అండ్ చేతి రాత అంశంలో భాగంగా విద్యార్థులకు చదువుకోవడానికి సమయం ఇస్తున్నారు. వారంలో అయిదు రోజులలో నిర్వహించిన రోజువారీ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన పాఠ్యాంశాలపై దృష్టి సారిస్తున్నారు. ఉదయం విద్యార్థినులు లేచిన తరువాత గంట సేపు రాత్రి చదివిన పాఠాలనే మళ్లీ చదివిస్తున్నారు. దీని వల్ల పాఠాలను మరచిపోకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని అంటున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి..



కేజీబీవీలో పది, ఇంటర్మీడియట్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు 'విజయపథం' ప్రణాళికను పక్కాగా అమలు చేస్తున్నాం. ప్రత్యేక తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థి మరింతగా సాధన చేసేందుకు.. పాఠ్యాంశాన్ని నేర్చుకునేందుకు అవకాశం ఉంటుంది.

-ఎస్.కృష్ణవేణి, కేజీబీవీ ప్రత్యేకాధికారి, హిరమండలం

భక్తుల భద్రతకు పెద్దపీట

- వేంకటేశ్వరాలయంలో సమూల మార్పులు
- భారీ క్యూలైన్లు, బారికేడ్ల ఏర్పాటు
- అంతర్గత రహదారులు, మౌలిక వసతులు
- భక్తులను నియంత్రించేందుకు సిబ్బంది
- ప్రత్యేక పర్వదినాల్లో పోలీసుల భద్రత



ఆలయం వద్ద క్యూలైన్ల కోసం ఏర్పాటు చేస్తున్న ఐరన్ బారికేడ్లు

కాశీబుగ్గ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వేంకటేశ్వరాలయానికి సంబంధించి భక్తుల భద్రతకు పెద్దపీట వేస్తూ కీలక మార్పులు చేస్తున్నారు. ప్రత్యేక బారికేడ్లతో పాటు లోపలికి వెళ్లే మార్గం.. బయటకు వచ్చే మార్గాల్లో ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. స్వామి వారిని దర్శనం చేసుకునే ఆలయం వెలుపల మార్గం గుండా బయటకు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వేలాది మంది భక్తులు ఒకేసారి వస్తే నియంత్రించేందుకు పెద్దపెద్ద ఐరన్ బారికేడ్లు అందుబాటులోకి తెస్తున్నారు. అంతర్గత రోడ్లతోపాటు తాగునీరు, భక్తుల సౌకర్యార్థం సేదదీరే ఏర్పాట్లను సైతం చేస్తున్నారు. ఈ నెల 1న ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది భక్తులు చనిపోగా, 14 మందికిపైగా గాయపడ్డారు. మృతులతో పాటు క్షతగాత్రుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం కూడా అందించింది. కాగా ఈ ఘటనకు సంబంధించి అధ్యయనానికి టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, ఏఎస్పీ కేవీ రమణ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీని ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఈ కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. దీని ప్రకారం భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులు కొలిక్కి వచ్చిన తర్వాత తిరిగి స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు. అయితే గత అనుభవాల దృష్ట్యా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు. మరోవైపు భక్తులను నియంత్రించేందుకు సిబ్బందిని నియమిస్తున్నారు. ఆపై పోలీసుల నిరంతర భద్రత ఉండేలా చర్యలు చేపడుతున్నారు.




స్వామివారి దర్శనం తర్వాత ఆలయ వెనుక భాగం నుంచి వెళ్లేలా ఏర్పాటు చేసిన ద్వారం



గుడి ముఖద్వారం వెడల్పు చేసి బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

పూర్తిస్థాయిలో ఏర్పాట్లు..



త్రిసభ్య కమిటీ ఆదేశాల మేరకు ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అధికారులు పరిశీలించాక అనుమతులు వస్తే అన్ని రకాల పూజలు, హోమాలు చేసి ఆలయాన్ని తెరుస్తాం. స్వామివారిని దర్శనం చేసుకున్న భక్తులు వెనుక వైపు నుంచి బయటకు వెళ్లేలా క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇకపై భక్తులకు పూర్తిస్థాయి భద్రత ఏర్పాటు చేస్తాం.

-హరిముకుంద పండా, ఆలయ ధర్మకర్త

అయ్యప్ప దీక్ష ముగించుకుని ఇంటికి వస్తుండగా..

(ఐదో పేజీ తరువాయి)

ఈ విషయాన్ని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు తెలియజేశారు. ఆయన ఆదేశాల మేరకు తమిళనాడు ప్రభుత్వం క్షతగాత్రులకు మెరుగైన వైద్యసహాయం అందిస్తుంది. ఈ సంఘటనతో మృతుల గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

పోషిస్తాడు అనుకుంటే..

రామేశ్వరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాయికుమార్‌కు తల్లి గీతమ్మ, తండ్రి జయరామ్ ఉన్నారు. వీరికి సాయి కుమార్ ఏకైన సంతానం. సాయికుమార్ ఐటీఐ చదివి డ్రైవింగ్ కూడా నేర్చుకున్నాడు. మూడు నెలల కిందట సొంతంగా కారును కొనుగోలు చేశాడు. దీన్ని అద్దెకు తిప్పుతూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాడు. కుటుంబం, తన బాగుకోరి అయ్యప్పస్వామి మాలధారణ చేశాడని, తీర్థయాత్రలు చేసుకొని తిరిగి వస్తే పుణ్యం లభిస్తుందనకుంటే రోడ్డు ప్రమాదంలో తన కుమారుడు మృతి చెందాడని తల్లి గీతమ్మ విలపిస్తుంది. వృద్ధాప్యంలో తమను పోషిస్తాడని అనుకున్న ఒక్కగానొక్క కొడుకు మృతి చెందాడని, తమకు ఇక ఎవరు దిక్కని కన్నీరుమున్నీరవుతోంది.

● మరో మృతుడు నవీన్‌ది కూడా ఇదే పరిస్థితి. తండ్రి మృతి చెందగా తల్లి భవాని, తమ్ముడు, సోదరితో కలిసి నివాసం ఉంటున్నాడు. నవీన్ కూడా ఐటీఐ పూర్తి చేశాడు. హెవీడ్రైవింగ్ లైసెన్స్ కూడా ఉంది. జాతీయరహదారి అంబులెన్స్‌లో డ్రైవరుగా పనిచేస్తున్నాడు. అయ్యప్పమాల వేయడంతో సెలవులో ఉన్నాడు. ఈ క్రమంలో రామేశ్వరం వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



రోదిస్తున్న సాయికుమార్ తల్లి గీతమ్మ



మర్రివలసలో ధాన్యాన్ని బస్తాలుగా సిద్ధం చేస్తున్న రైతులు

తుఫాన్ హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన

- ధాన్యాన్ని భద్రపరిచేందుకు పాట్లు

జి.సిగడాం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో పండిన పంటను కాపాడుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే పంట చేతికి అందివచ్చినా తుఫాన్ వల్ల ఎక్కడ నష్ట పోతామో అన్న ఆందోళన చెందుతున్నారు. కోసిన పంటను పొలాల్లోనే కుప్పలుగా ఏర్పాటు చేస్తున్నారు. మరికొందరు రైతులు నూర్చిన ధాన్యాన్ని బస్తాలుగా చేసి టార్పాలిన్లు కప్పే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం తమ వద్దనున్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



నాగులవలసలో షెడ్‌లో ధాన్యం రాసులపై టార్పాలిన్లు కప్పిన దృశ్యం

ఆలయాలకు మహర్దశ

(ఐదో పేజీ తరువాయి)

అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు.

● ఈ నెల 12న జరిగిన సీజీఎఫ్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ రెండు ఆలయాలకు నిధులు మంజూరయ్యాయి. ఈ గ్రాంటును పొందేందుకు దేవదాయ శాఖ కొన్ని కీలక నిబంధనలను విధించింది. ఎండల మల్లికార్జున స్వామి ఆలయంలో అలంకరణ ప్రాకారం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. మొత్తం అంచనా వ్యయం రూ.3 కోట్లు అని ప్రతిపాదించారు. సీజీఎఫ్ వాటా కింద ప్రస్తుతం రూ.2.40 కోట్లు విడుదల కాగా, మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ (ఎంసీ) నుంచి రూ. 60 లక్షలు మంజూరు చేశారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఈ మెమో జారీ అయిన తేదీ నుంచి ఒక నెల రోజులలోపు మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ రూ.60 లక్షలు మొత్తాన్ని జమ చేయాల్సిఉంది. నిర్ణీత గడువులోపు జమ చేయకుంటే సీజీఎఫ్ గ్రాంట్ మంజూరు చేయబడదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

● కొత్తమ్మ తల్లి ఆలయంలో ప్రాకార మండపం నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.5 కోట్లు అంచనా వ్యయంతో ప్రణాళిక రూపొందించారు. సీజీఎఫ్ గ్రాంటు కింద రూ. 4కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ (ఆలయ వాటా) కింద రూ. కోటి ఆలయ తరఫున జమ చేయాల్సి ఉంటుంది. నెల రోజుల్లోగా ఈ మ్యాచింగ్ గ్రాంటును జమ చేయకుంటే.. సీజీఎఫ్ నుంచి మంజూరైన రూ. 4 కోట్లు రద్దు చేయబడతాయని నిబంధనల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ జమ చేయకుండా పరిపాలనాపరమైన, సాంకేతికపరమైన అనుమతులు పొందకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ టెండర్ల ప్రక్రియను ప్రారంభింకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ఈ ఉత్తర్వులను జిల్లా దేవదాయ శాఖ అధికారికి, ఆలయ ఎగ్జిక్యూటివ్ అథారిటీకి, ఇంజనీరింగ్ అధికారులకు పంపినట్లు కమిషనర్ కార్యాలయం తెలిపింది.

నిధులున్నా పనులు చేయట్లే!

(ఐదో పేజీ తరువాయి)

ఒక్కటి కూడా పూర్తి కాలేదు. పాతపట్నం నియోజకవర్గంలో 989 ఇళ్లకు గాను 110 పూర్తయ్యాయి. ఇంకా 453 గృహాల పనులు ప్రారంభమే కాలేదు. 426 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. మందస మండలంలో 136 ఇళ్లకు ఒక్కటి కూడా పూర్తికాలేదు. మొత్తం ప్రాజెక్టు విలువ రూ. 37.40 కోట్లు. ఇప్పటివరకు ఖర్చు చేసింది రూ.9.87 కోట్ల (26 శాతం) నిధులు మాత్రమే. మిగిలిన నిధులు ఎప్పుడు ఖర్చు చేస్తారు..? ఇళ్లు ఎప్పుడు పూర్తి చేస్తారు? అన్నదానికి అధికారుల నుంచి సమాధానం లేదు. నిధుల కొరత లేదని ప్రభుత్వం చెబుతున్నా పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. దీనికి కారణం అధికారుల పర్యవేక్షణ లోపమా? లేక కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమా? అన్నది తెలియాల్సి ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పీఎం జన్‌మన్ పనులను పరుగులు పెట్టిస్తారో లేదో చూడాలి.

నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

- కలెక్టరేట్ వద్ద అఖిలపక్ష సంఘాల ధర్నా



లేబర్ కోడ్ల ప్రతులను దహనం చేస్తున్న అఖిలపక్ష నేతలు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్మికులను కార్పొరేట్లకు బానిసలుగా మార్చవద్దని, వారి హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను తక్షణం రద్దు చేయాలని అఖిల పక్ష సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. లేబర్ కోడ్ల ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఆయా పార్టీ నేతలు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా చేసిన పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువస్తూ తీసుకువచ్చిన ఉత్తర్వులు దుర్మార్గమని, వీటితో కార్మికుల హక్కులకు భంగం కలిగిందన్నారు. పర్మినెంట్, కాంట్రాక్టు పద్ధతి స్థానాల్లో పరిమిత కాల ఉద్యోగ పద్ధతి తెచ్చారని, కార్మిక సంఘాల ఏర్పాటుకు కనీస సభ్యుల సంఖ్యను పెంచడం, నిరసనలు, ధర్నాలు నిర్వహించేందుకు అనుమతులు రద్దు తప్పనిసరి చేయడం, పని ప్రదేశాల్లో ప్రమాదాలు సంభవిస్తే పరిహారాన్ని యాజమాన్యాల ఇష్టానికే వదిలేయడం దారుణమన్నారు. తక్షణం ఈ లేబర్ కోడ్ల ఉత్తర్వులను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు పోరాడి సాధించుకున్నవే తప్ప పాలకుల దయాదాక్షిణ్యాలతో ఇచ్చినవి కావని గుర్తు చేశారు. కార్మిక హక్కులను కాలరాస్తే సహించేది లేదని, ఐక్య పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ అమ్మన్నాయుడు, రైతు సంఘం నేతలు కె.మోహనరావు, పి.చంద్రరావు, ప్రసాదరావు, కిసాన్‌మోర్చా కన్వీనర్ తాండ్ర ప్రకాష్, ఏఐటీయూసీ నేతలు చిక్కాల గోవిందరావు, కృష్ణవేణి, మెడికల్ రిప్స్ యూనియన్ నాయకుడు దేవాది వాసుదేవరావు, కౌలు రైతు సంఘం నాయకుడు వెలమల రమణ, కిసాన్ కాంగ్రెస్ నాయకులు సనపల అన్నాజీరావు, ఆర్.ప్రకాశరావు, గోవర్ధనరావు, ఎన్.బలరాం, డి.యుగంధర్, అప్పలరాజు, చంద్రశేఖర్, జగ్గారావు పాల్గొన్నారు.

బీసీ రుణాలు ఎప్పుడిస్తారో?

(ఐదో పేజీ తరువాయి)

ఉపాధి యూనిట్ స్థాపించేందుకు దారిద్ర్యరేఖకు (బీపీఎల్) కు దిగువనున్న బీసీ అగ్రవర్ణ పేదలు (ఈడబ్ల్యూఎస్) కమ్మ, రెడ్డి, ఈబీసీ, క్షత్రియ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కులస్థులకు చెందిన 21-60ఏళ్ల వయసు గల వారి నుంచి దరఖాస్తులు సేకరించింది. అదే విధంగా డి-ఫార్మసి, బీ-ఫార్మసీ పూర్తిచేసి ఉన్న బీసీ, ఈడబ్ల్యూఎస్ నిరుద్యోగ యువత జనరిక్ ఫార్మసీల ఏర్పాటు నిమిత్తం, 21-50 సంవత్సరాల మధ్య వయసు ఉన్న (కాపు తెలగ, బలిజ, ఒంటరి) వారికి స్వయం ఉపాధి పథకం స్థాపించేందుకు సబ్సిడీతో కూడిన రుణాల మంజూరు చేసేందుకు అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. దీంతో ఈ ఏడాది మార్చిలో అభ్యర్థులు అధికసంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు.

యూనిట్ విలువ ఇలా..

బీసీ స్వయం ఉపాధి పథకం కింద స్లాబ్-1 యూనిట్ విలువ రూ.2లక్షల వరకు (50శాతం సబ్సిడీ, గరిష్ఠంగా రూ.75వేలు), స్లాబ్-2 యూనిట్ విలువ రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు (50శాతం సబ్సిడీ, గరిష్ఠం రూ.1.25లక్షలు), స్లాబ్-3 యూనిట్ విలువ రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు (50శాతం సబ్సిడీ గరిష్ఠంగా రూ.2లక్షలు) మంజూరు చేయాల్సి ఉంది. జిల్లాకు సంబంధించి 2,724 యూనిట్‌లకు గానూ రూ.51.87కోట్ల మంజూరు చేసేందుకు ప్రతిపాదించారు. అలాగే స్వయం ఉపాధి పథకం ఈబీసీ కమ్మ, రెడ్డి బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్యవైశ్యులకు 41యూనిట్‌లకు గాను రూ.71లక్షలు మంజూరు కావాల్సి ఉంది. కాపు స్వయం ఉపాధి పథకానికి సంబంధించి 105 యూనిట్లకు గాను రూ.3.54కోట్లు కేటాయించాల్సి ఉంది.

జిల్లాపై చిన్నచూపు..

బీసీ రుణాల కోసం దరఖాస్తులు అందించి ఎనిమిది నెలలు దాటుతున్నా ఇంకా మంజూరు కాలేదని అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. వివిధ బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు సైతం నిర్వహించేశారని, అయినా రుణాలు ఎందుకు మంజూరు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో పలు జిల్లాలో ఇప్పటికే సబ్సిడీ రుణాలు మంజూరైనట్లు తెలుస్తోంది. కానీ, శ్రీకాకుళం జిల్లాపై అధికారులు, పాలకులు చిన్నచూపు చూస్తున్నారని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా రుణాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

గంజాయితో రైల్వేస్టేషన్‌కు..

(ఐదో పేజీ తరువాయి)

సూరత్‌కు తరలించారు. ఇదే విధంగా బుధవారం కూడా సంజుక్తదాస్‌తో పాటు పటాపూర్ గ్రామానికి చెందిన లోక్‌నాథ్ ప్రధాన్ ఒడిశాలో 29కేజీల గంజాయిని కొనుగోలు చేసి బస్సు మార్గంలో ఇచ్ఛాపురం పట్టణానికి చేరుకున్నారు. అక్కడ నుంచి స్థానిక రైల్వే స్టేషన్‌కు వచ్చారు. రైలులో సూరత్ వెళ్లి రంజాన్ ప్రధాన్‌కు గంజాయిని ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. పట్టణ ఇన్‌చార్జి ఎస్ఐ రవివర్మ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన సంజుక్తదాస్, లోక్‌నాథ్ ప్రధాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. గంజాయి సీజ్ చేయటంతో పాటు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ రవివర్మ పాల్గొన్నారు.

'అదనం' ఇవ్వాల్సిందే

(ఐదో పేజీ తరువాయి)

చోటుచేసుకుంది. జిల్లాలో చాలాచోట్ల ఇలానే జరుగుతోంది. మిల్లుల వద్ద ధాన్యం దించడం, చేరినట్లు నివేదిక ఇచ్చే బాధ్యత కస్టోడియన్ అధికారులది. అయితే కొన్ని చోట్ల వీరు ఉత్సవవిగ్రహాలుగా మారిపోయారు. ధాన్యం మిల్లుల వద్దకు చేరాక ఈలింగ్‌ను ప్రభుత్వం ఇచ్చిన యంత్రాలతో చేయాలి. కానీ కొందరు మిల్లర్లు తమ యంత్రాలతో చేసి సాకులు చెబుతున్నారు. ఇక్కడే రైతులను మోసం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈలింగ్ 95 నుంచి 100 శాతం రావాలని అధికారులు చెబుతుంటే.. మిల్లర్లయంత్రాలతో చేయడం వల్ల నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకేదళారులకు బస్తా రూ.1750కే అమ్ముతున్నామని వాపోతున్నారు.

ఉదయం పది నుంచి పడిగాపులు..

దేశనిపేట మిల్లులో ఉదయం 10 గంటలకు 30 బస్తాల ధాన్యం తీసుకువచ్చాను. మిల్లర్ బస్తాకు అదనంగా 6కేజీలు అడిగారు. అంత ఇవ్వలేమని చెప్పాను. దీంతో లోడ్ దించవద్దని కళాసీలకు మిల్లర్ తెలిపారు. అధికారులకు సమాచారం ఇచ్చినా వారు స్పందించలేదు. తమ గ్రామానికి చెందిన ఓ నాయకుడికి సమాచారం ఇచ్చాను. ఆయన వచ్చి మాట్లాడినా అదనంగా ఇవ్వాల్సిందేనని మిల్లర్ డిమాండ్ చేశారు. దీంతో ఆయన తహసీల్దార్ సత్యనారాయణకు ఫోన్ చేయగా.. ఇది తమ పరిధిలోలేదని చెప్పారు.

-తంగి రవీంద్ర, కంబకాయి

ధాన్యం తీసుకోవాలని ఆదేశించాం..

కంబకాయి గ్రామం నుంచి వచ్చిన ధాన్యం మిల్లర్ దించడం లేదని ఫిర్యాదు చేస్తే దేశవానిపేట మిల్లుకు వెళ్లాను. అక్కడ రైతు మిల్లర్‌తో మాట్లాడి అదనంగా ధాన్యం డిమాండ్‌పై ఆరా తీశాను. అదనంగా తీసుకోరాదని మిల్లర్‌ను ఆదేశించాం. అలాగే రైతు తెచ్చిన ధాన్యం ముక్కలు అవుతున్నట్లు మిల్లర్ చెప్పడంతో గుర్తించాం. మిల్లులో ధాన్యం దించాలని చెప్పినా.. రైతులు వినకుండా తీసుకుని వెళ్లిపోయారు.

-రామకృష్ణ, సీఎస్‌డీటీ, నరసన్నపేట

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి పూజలు



జి.సిగడాం: సంతవురిటిలో కల్యాణ మురగన్ స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా పలు దేవాలయాల్లో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజ లు, కల్యాణాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లోని స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేసి పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

-ఆంధ్రజ్యోతి బృందం



పలాస: స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శిరీష



ఇచ్ఛాపురం: బెల్లుపడలో కల్యాణ మండపానికి విగ్రహాలను తీసుకువెళ్తున్న భక్తులు



సోంపేట రూరల్: తాళభద్ర తారకేశ్వరాలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



టెక్కలి: పూజలందుకున్న సుబ్రహ్మణ్య స్వామి



నందిగాం: అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి



గార: కుమ్మరిపేటలో పుష్పాలంకరణ



పోలాకి: మబగాంసుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



నరసన్నపేట: బొరిగివలసలో..



మందస: సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో..

న్యూస్ బాక్స్

గ్రామాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

సరుబుజ్జిలి, నవంబరు, 26 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతపై గ్రామ స్థాయిలో సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో ఎం.పావని తెలిపారు. క్లీన్ అండ్ గ్రీన్ థీమ్-5లో భాగంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో డ్వాక్రా సంఘాలు, వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బొడ్డేపల్లి రామారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలపై దృష్టి సారించాలి

జి.సిగడాం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాల నిర్వహ ణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య అన్నారు. బుధ వారం వాండ్రంగి గ్రామాన్ని సందర్శించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవా లన్నారు. కాలువల్లో పేరుకు పోయిన సిల్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఇంటి నుంచి సేకరించే చెత్తను సంపద కేంద్రాలకు తరలించి ఎరువుల తయారీకి ఉపయోగించాలని సూచిం చారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రామకృష్ణ, ఎచ్చెర్ల ఏఎంసీ ఉపాధ్యక్షుడు బూరాడ వెంకట రమణ, సర్పంచ్‌లు సాకేటి నాగరాజు, బుడారి లక్ష్మణ రావు, పంచాయతీ కార్యదర్శి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్‌కు అభినందన

ఇచ్ఛాపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెడ్డిక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన కొండా శంకర్ రెడ్డిని, ఎమ్మెల్యే అశోక్‌ను బుధవారం పొత్తంగి గ్రామానికి చెందిన రెడ్డి కులస్థులు అభినందించారు. రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే కార్యాలయంలో వారికి శాలువలు కప్పి, పుష్ప గుచ్ఛాలిచ్చి సత్కరించారు.

వరకట్న దురాచారాన్ని నిరోధించాలి



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం లీగల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరకట్న దురా చారాన్ని నిరోధించాల్సిన బాధ్యత అందరిపై ఉందని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. బుధవారం స్థానిక సంస్థ కార్యాలయంలో వరకట్న దురాచారంపై మహిళా పోలీస్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వరకట్నం అనేది వస్తు రూపంలో గాని, ధన రూపంలో గాని తీసుకోవడం నేరమన్నారు. పెళ్లి అయిన స్త్రీని వరకట్నం తెమ్మని బాధిస్తే అటువంటి వారిపై కఠి న చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో దిశ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.నారీమణి, న్యాయవాది జి.ఇందిరాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సా రించాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. బుధవారం రాజపురంలో 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతన్నలు బాగుండాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అంతర్ పంటల సాగుతో లబ్ధి పొందవచ్చన్నారు. అధికారులతో కలిసి రైతుల ఇంటి వద్దకు వెళ్లి వారితో చర్చించారు. కార్యక్రమంలో ఏడీఏ టి.భవానీశంకర్, తహ సీల్దార్ మురళీమోహన్, వ్యవసాయాధికారి పి.శ్రీదేవి, ఇచ్ఛాపురం ఏఎంసీ చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, పీఏసీఎస్ చైర్మన్ బాసుదేవ్‌ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులను పాటించండి

ఆమదాలవలస, నవంబరు, 26 (ఆంధ్రజ్యోతి): మారుతున్న వాతావరణానికి అనుకూలంగా వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలతో ఆధునిక సాగు పద్ధతులను పాటించాలని వ్యవసాయశాఖ ఏడీ బి.రజని అన్నారు. బుధవారం చిట్టివలస, డివంజిపేట, పీర్‌సాహెబ్‌పేట గ్రామాల్లో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఆమదాలవలస కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ కె.చిటిబాబు రైతు లకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఏవో మెట్ట మోహన్‌రావు, సర్పంచ్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి: ఎన్ఈఆర్



సీవీపీపీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. జేఆర్‌పురంలో ఎచ్చెర్ల నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక (సీవీపీపీ) కార్యాలయాన్ని బుధ వారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యాలయాన్ని నియోజక వర్గ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పి.సుగుణాకరరావు, మాజీ ఎంపీపీ డీజీఎం ఆనందరావు, లావేరు మండల టీడీపీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్, రణస్థలం సర్పంచ్ పిస్నింటి వెంకటబానోజీ నాయుడు, నాయకులు నిడిగంట్ల త్రినాథ్, పిసిని జగన్నాథం, మండపాక కనకారావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విష్ణుదేవ్ నంబూద్రి సుస్వర గానామృతం



సంగీత కచేరీ చేస్తున్న విష్ణుదేవ్ నంబూద్రి

అరసవల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆరామ ద్రావిడ సంఘం, సుమిత్ర కళా సమితి ఆధ్వర్యంలో స్థానిక బాపూజీ కళామందిర్‌లో కేరళకు చెందిన విష్ణుదేవ్ నంబూద్రి సుస్వర గానామృతం ఆహూతులను మంత్రముగ్ధులను చేసింది. అరసవల్లికి చెందిన ఇప్పిలి జోగారావు 102వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. నాలుగు రోజులు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలి రోజు విష్ణుదేవ్ నంబూద్రి గానామృతంతో కళాభిమానులను ఓలలాడించారు. ఈ సందర్భంగా ప్రముఖ వయోలిన్, మృదంగ విద్వాంసులు వరదా దుర్గారావు, బిక్షష్టారావులను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు, కళాభి మానులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

ఎచ్చెర్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కింతలి మిల్లు జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ఓ లారీకి బ్రేక్ పాడై డివైడర్ పైకి దూసుకుపోయింది. డ్రైవర్ జాగ్రత్తగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఒడిశా నుంచి విశాఖపట్నం వైపు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎచ్చెర్ల పోలీసులు తెలిపారు.

ఉమారుద్రుని ఆదాయం రూ.2.64 లక్షలు

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాగావళి తీరంలో వెలసిన సు ప్రసిద్ధ శైవక్షేత్రం ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయానికి రూ.2,64,532 ఆదాయం వచ్చింది. బుధవారం హుండీలను లెక్కించారు. కార్తీకమాసం సందర్భంగా 42 రోజులకు గాను ఈ మొత్తం వచ్చిందన్నారు. కార్యక్రమంలో పాలకమండలి అధ్యక్షుడు దేవేంద్రనాయుడు, ప్రధాన అర్చకుడు ఆరవెల్లి శ్రీరామ్మూర్తి శర్మ, సభ్యులు శివరామ రాజు, రమేష్, కమల పాల్గొన్నారు.

మహిళలపై హింసను నివారించాలి

అరసవల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న హింసను నివారించాలని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రతినిధులు అన్నారు. అంతర్జాతీయ మహిళా హింస నిర్మూలన దినోత్సవం సందర్భంగా నగరంలోని అరసవల్లి మిల్లు జంక్షన్ వద్ద బుధవారం ర్యాలీ నిర్వహించారు. క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వం, ప్రజలు చొరవ తీసుకుని స్త్రీల స్వేచ్ఛను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ పైడి సింధూర, డాక్టర్ శ్రావ్య, టీడీపీ నాయ కురాలు పిరియా మాధవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు జిల్లా క్రీడాకారులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు రాష్ట్ర కబడ్డీ సంఘం నుంచి ఆదేశాలు వచ్చాయి. కోటబొమ్మాళి మండలం కొత్తపేటకు చెందిన జీరు చంద్రలేఖ (కెప్టెన్), పాత్రుని గీతిక (కోటబొమ్మాళి), అఖరకండి మేఘన (నందిగాం మండలం నౌగాం) ఎంపికయ్యారు. వీరంతా గురువారం నుంచి 30వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో జరగ నున్న జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. జాతీయ పోటీల్లోనూ రాణించి రాష్ట్రానికి, జిల్లాకు పేరుప్రతిష్ఠలు తీసుకురావాలని జిల్లా కబడ్డీ సంఘం చైర్మన్, ఎమ్మెల్యే గొండు శంకర్, అధ్యక్షుడు నక్క రామకృష్ణ, కార్యదర్శి సాధు ముసలినాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు ఆకాంక్షించి అభినందించారు.

15 నాటికి అందుబాటులోకి టర్ఫ్ వికెట్

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏడురోడ్ల కూడలి సమీపంలో ఉన్న ఎన్టీఆర్ మున్సిపల్ పాఠశాల క్రీడా మైదానంలో మహిళల నెట్ ప్రాక్టీస్‌కు సంబంధించిన టర్ఫ్ వికెట్ డిసెంబరు 15 నాటికి అందుబాటులోకి రానుందని జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు బుధవారం సంఘం కార్యదర్శి హసన్‌రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మ ద్, ట్రెజరర్ శైలాని టర్ఫ్ వికెట్, సిమెంట్ వికెట్ పనితీరును పరిశీలించారు. ఎర్త్ వర్క్ పూర్త యిందని, టర్ఫ్ వికెట్‌కు తగ్గట్టు మట్టిని, వికెట్‌పై వేసే గడ్డిని తెప్పించాల్సి ఉంటుందన్నారు. మహిళా క్రికెటర్లను ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మహిళా క్రికెట్ శిక్షకులు హరికా యాదవ్, రమణమ్మ పాల్గొన్నారు.

హెల్త్ సెక్రటరీలకు పదోన్నతులు కల్పించాలి



ధర్నా నిర్వహిస్తున్న హెల్త్ సెక్రటరీలు

అరసవల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): హెల్త్ సెక్రటరీలకు ఏఎన్ఎంలుగా పదోన్నతులు కల్పించాలని ఏపీ హెల్త్ సెక్రటరీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో బుధవారం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ.. గత ఏడాది నవంబరులో పదోన్నతుల జీవోను ప్రభుత్వం జారీ చేసిందని, కాని శ్రీకాకుళం జిల్లాలోనే ఇంతవరకు పదోన్నతులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. వైద్యారోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్యం, సమన్వయ లోపం కారణంగా పదోన్నతులు ఇంతవరకు పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 150 ఖాళీలను పదోన్నతులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బి.మురళి, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.సాయి ప్రసాద్, అసోసియేషన్ అధ్య క్షురాలు డి.ఝాన్సీ నేతలు పద్మ ప్రియ, మాధవి, అరుణ, రమ, చిన్ని, హేమలత, జీవిత పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రవికుమార్

పొందూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మత విశ్వాసాలను ప్రతి ఒక్కరూ గౌరవించుకోవాలని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. తండ్యాం పంచాయతీ బొట్లపేటలో బుధవారం అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ అన్నెపు రాము, టీడీపీ ఉపాధ్యక్షుడు బాడాన గిరి, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు ఎ.విజయలక్ష్మి, సర్పంచ్ కె.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లు రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నేతలు

ఎచ్చెర్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ రంగానికి మేలు చేసే లేబర్ కోడ్ల ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. అరిణాం అక్కివలస నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమ ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. కార్మిక హక్కులను కాలరాసే 4 లేబర్ కోడ్‌లను ఉప సంహరించుకునేంతవరకు పోరాటం చేస్తామన్నారు. అగ్రికెమ్ కార్మిక సంఘ నేతలు అంబటి సత్యనారాయణ, ఎల్.రామప్పుడు పాల్గొన్నారు.

ఏపీ నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్‌గా విజయలక్ష్మి



విజయలక్ష్మి

పొందూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాగవంశం సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పొందూరుకు చెందిన అనకాపల్లి విజయలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 15 మంది డైరెక్టర్లు ఉన్న ఈ కార్పొరేషన్‌కు అనకాపల్లి విజయలక్ష్మిని కూడా ఒక డైరెక్టర్‌గా నియమించారు. ఈమె సర్పంచ్‌గా పనిచేశారు. ప్రస్తుతం తెలుగు మహిళా మండల అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. విజయలక్ష్మిని పలువురు టీడీపీ నాయకులు అభినందించారు.

ఆలయంలోకి కొండచిలువ



ఆలయంలో చేరిన కొండచిలువ

బూర్జ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కిలంతర గ్రామంలోని అమ్మవారి ఆలయంలోకి బుధవారం ఓ పెద్ద కొండ చిలువ చేరుకుని హల్‌చల్ చేసింది. దీనిని చూసిన స్థానికులు భయాందోళన చెందారు. దాదాపు ఏడు అడుగు ల పొడవు ఉంటుందని, నాగావళి కాలువ నుంచి వచ్చిం దని భావిస్తున్నారు. భయాందోళనతో దీనిని గ్రామస్థులు హతమార్చారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలతోపాటు కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- ఆంధ్రజ్యోతి బృందం



కాశీబుగ్గ: చిన్నబాదం హైస్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శన



సంతబొమ్మాళి: దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో..



పలాస: సిబ్బందితో ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయాధికారి మాధురి



ఇచ్ఛాపురం: శాసనాం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మాక్ పార్లమెంట్



పాతపట్నం: ఏపీ మోడల్ స్కూల్‌లో..



నరసన్నపేట: సివిల్ కోర్టులో ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయాధికారి, న్యాయవాదులు



కంచిలి: అర్జునాపురం ఎంపీపీ పాఠశాల చిన్నారుల ప్రదర్శన



హిరమండలం: రంగులతో అంబేడ్కర్ చిత్రాన్ని వేసిన కేజీబీవీ విద్యార్థినులు



అరసవల్లి: ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో అనిత



హరిపురం: మందస మండలం హరిపురం పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



ఎచ్చెర్ల: వివిధ పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ



ఆమదాలవలస: వేషధారణలో వెదుళ్లవలస జడ్పీ పాఠశాల విద్యార్థులు

భారత రాజ్యాంగం.. ప్రజాస్వామ్యానికి పునాది: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, నవంబరు, 26(ఆంధ్రజ్యోతి): భారతదేశ రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి పునాది అని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిం చారు. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం వంటి విలువలతో నిండిన రాజ్యాంగం రూపకల్పనలో అంబేడ్కర్ విశేషమైన కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఏవో సీహెచ్ గోపీనాథ్, డీఎస్పీ శేషాద్రి, ఆర్ఐ నరసింగరావు, సీఐలు దేముళ్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి



అరసవల్లి: శాంతినగర్ కాలనీ గాంధీ మందిరం పార్కులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడి మృతి

వజ్రపుకొత్తూరు నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పూండి రైల్వేస్టేషన్ వద్ద బుధవారం ఉదయం రైలుఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి చెందినట్టు పలాస జీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మెట్ట సోమేశ్వరరావు తెలిపారు. స్టేషన్ మాస్టర్‌కు విధి నిర్వహణలో ఉన్న గ్యాంగ్‌మన్ సమాచారం అందించారు. పూండి స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలన చేశామని చెప్పారు. ముఖ భాగం పూర్తిగా నుజ్జవడంతో యువకుడ్ని గుర్తించలేక పోతున్నట్టు చెప్పారు. యువకుడి వయసు 30 నుంచి 35 సంవత్సరాలు మధ్య వయస్సు ఉంటుందని ఆయన చెప్పారు. జీన్ ఫ్యాంట్, బూడిద రంగు గల పొడవు చేతుల టీషర్టు ధరించి ఉన్నట్టు తెలిపారు. వివరాలు తెలిసినవారు 949250069 ఫోన్ నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

చిలకలూరిపేటలో వాల్లెపేట వాసి..



కన్నంనాయుడు (ఫైల్)

లావేరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బతుకు తెరువు కోసం చిలకలూరిపేట వెళ్లిన గుమడాం పంచాయతీ వాల్లేపేటకు చెందిన వాల్లె కన్నంనాయుడు (38) మంగళవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఏడాది కిందట చిలకలూరిపేటకు వలస వెళ్లాడు. అక్కడ ఊక లారీలకు లోడ్ చేసే పనిలో చేరి కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఊకను లారీలోడ్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కన్నంనాయుడికి భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్ద అకాల మరణంతో వారు దిక్కులేని వారయ్యారని బంధువులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

సాగునీటి కాలువలో పడి ఒకరు..

శ్రీకాకుళం రూరల్, నవంబరు 26(ఆంధ్ర జ్యోతి): సాగునీటి కాలువలో జారిపడి ఒకరు మృతి చెందిన ఘటన పెద్దపాడులో చోటుచే సుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరా లా ఉన్నాయి.. తంగివానిపేటకు చెందిన ముద్దాడ తారకేశ్వరరావు(35) సమీపంలో గల సాగునీటి కాలువలో మంగళవారం రాత్రి ప్ర మాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. బు ధవారం ఉదయం స్థానికులు గమనించి పో లీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. భార్య ముద్దాడ రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్ట్

ఎచ్చెర్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్‌లో విద్యార్థి ప్రత్తిపాటి సృజన్ (20) ఈనెల 12న ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు విద్యార్థులను బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. సృజన్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న ఎనిమిది మందిని గతంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

కొత్తమ్మతల్లి ఆదాయం రూ.6.91 లక్షలు



హుండీలను లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

కోటబొమ్మాళి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తమ్మతల్లి అమ్మవారి ఆలయంలో గల హుండీలను 60రోజులకు గాను లెక్కించిగా.. రూ.6,91,975 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ధర్మహుండీలను దేవదాయ శాఖ అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో విప్పి లెక్కించారు. కార్యక్రమంలో రావివలస ఈవో జి.గురునాథరావు, ధర్మకర్తలి మండలి చైర్మన్ కోరాడ గోవిందరావు, సభ్యులు బొమ్మాళి ప్రసాదరావు, ప్రాతుని గోపి, దివాది లక్ష్మణరావు, దేవాది నాగరాజు, అంబటి అప్పారావు, మంచాల వెంకటరావు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

కాశీబుగ్గ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ప్రజా సంఘ నాయకులు గణపతి, అజయ్‌కుమార్, వెంకటరావు అన్నారు. బుధవారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ, ఏపీ రైతు సంఘం, సీపీఐ, ఏఐసీసీటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చేసి కార్మికులను బానిసలుగా చేయాలని ప్రభుత్వాలు చూస్తున్నాయన్నారు. వివిధ ప్రజా సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియామకం

మెళియాపుట్టి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నాగవంశం వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా పాతపట్నం నియోకవర్గం నుంచి ఇద్దరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాతపట్నం మండలానికి చెందిన అక్కురాడ సన్యాసిరావు, మెళియాపుట్టి మండలం పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన బూరెల లలితకుమారి నియమితులయ్యారు. అయితే లలితకుమారి తూరుకాపు (బీసీ-డీ) కావడంతో ఆమెను మార్చాలని పార్టీ అధిష్ఠానానికి సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. వీరి నియామకంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

స్వచ్ఛహరిత గ్రామాల సాధనకు కృషి చేయాలి

హిరమండలం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛహరిత గ్రామాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వయం సహాయ సంఘాల సభ్యులకు, వీవోఏలకు ప్రభుత్వం స్వచ్ఛహరిత గ్రామాల సాధన కార్యక్రమంపై నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చెత్త, మురుగు కాలువల నిర్వహణపై వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గోవిందరావు, మండల మహిళాసమైఖ్య అధ్యక్షురాలు ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

మాది చేతల ప్రభుత్వం

● ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం/ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మాది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. కాగువాడ గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో జరిగిన రైతన్నా నీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకతకు నిర్వచనంగా కూటమి పాలన సాగుతుందని తెలిపారు. మండ ల ప్రత్యేకాధికారి ఎం కరుణాకర్, తహసీల్దార్ ఎన్.ప్రసాదరావు, ఎంపీడీవో హెచ్‌వీ రమణమూర్తి, ఏవో కె.సింహాచలం సర్పంచ్ ఎన్.జగదీశ్వరరావు, టీడీపీ నేతలు మద్దు రామారావు, సైలాడ సతీష్, శివాల చిన్నయ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతోనే ఐకమత్యం

ఎల్ఎన్ పేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దైవసంబంధమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంతోనే ప్రజల్లో ఐకమత్యం నెలకొని శాంతియుత వాతావరణం కలుగుతుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. యంబరాం గ్రామంలో బుధవారం సర్పంచ్ వి.గోవిందరావు ఆధ్వర్యంలో నీలమ్మతల్లి అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మోహనరావు, కె.చిరంజీవి, బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు జిల్లా వైస్‌చైర్మన్ వి.ఆనందరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ కె.కృష్ణమాచారి, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.మన్మథరావు, నాయకులు ఎస్.తేజేశ్వరరావు, ఎ.పోలినాయుడు, జి.గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రిగ్స్ పోటీలు

నందిగాం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నౌగాం ఉన్నతపాఠశాల వేదికగా 76వ మండల స్థాయి బాలికల గ్రిగ్స్ పోటీలు రెండోరోజు ఉత్సాహంగా సాగాయి. సీనియర్, జూనియర్ విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు టి.వేణుగోపాలరావు పర్యవేక్షణలో పీఈటీ కె.ప్రకాష్, పీడీ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. సీనియర్ విభాగానికి సంబంధించి కబడ్డీలో నందిగాం, దిమ్మిడిజోల, ఖోఖోలో నందిగాం, కవిటిఅగ్రహారం, వాలీబాల్‌లో నర్సిపురం, నందిగాం, బ్యాడ్మింటన్‌లో దిమ్మిడిజోల, లఖిదాసుపురంలో మొదటి, రెండు స్థానాలు పొందాయి. అలాగే జూనియర్ విభాగానికి సంబంధించి కబడ్డీ దేవళభద్ర, లఖిదాసుపురం, ఖోఖో కేజీబీవీ, దేవళభద్ర, వాలీబాల్ నర్సిపురం, నందిగాం, బ్యాడ్మింటన్ లఖిదాసుపురం, నౌగాం మొదటి, రెండు స్థానాలు పొందాయని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు సంబంధించి వ్యాయామ ఉపాధ్యాయులకు గ్రామానికి చెందిన బెహరా దేవి క్రీడా టీషర్టులను వితరణగా అందించారు.

రైతులకు అనేక పథకాలు అమలు

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



తాళభద్రలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతు అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు అనేక పథకాలు అమలు చేస్తున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం కాశీబుగ్గ తాళభద్ర గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలో పలు సమస్యలపై ప్రజలు అందించిన వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తి, కౌన్సిలర్లు దువ్వాడ శ్రీకాంత్, సూర్యనారాయణరావు, ఏఎంసీ చైర్మన్ ఎం.శ్రీనివాస్‌రావు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, నాయకులు బడ్డ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లాభసాటి పంటలను సాగు చేయాలి

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో లాభసాటి పంటలను సాగు చేసేందుకు రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం మాకివలస గ్రామంలో రైతన్నా - మీకోసం కార్యాక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాణిజ్య పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, వ్యవసాయశాఖ ఏడీఏ వెంకటమధు, ఏవో సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు. అలాగే మడపాంలో నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీ సీఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీఎన్జీవో అసోసియేషన్ ఎన్నికలు

పలాస, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీ నుంచి డిసెంబరు 4వ తేదీ వరకూ జిల్లాలో ఉన్న వివిధ యూనిట్లలో ఉన్న ఏపీఎన్జీవో ఎన్నికలు జరుగుతున్నాయని పలాస ఎన్జీవో అధ్యక్షుడు బోనెల గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో ఉన్న ఉద్యోగులంతా కాశీబుగ్గ హైస్కూల్ రోడ్డులో ఉన్న ఎన్జీవో భవనం వద్దకు ఉదయం పది గంటలకు హాజరై ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు. ఎన్నికల అధికారిగా రాయి వేణుగోపాలరావు వ్యవహరిస్తారని తెలిపారు.

వీఆర్‌వోలపై దుర్భాషలు

● కంకర అక్రమ తరలింపుపై నోటీసులు

● తీసుకునేందుకు నిరాకరించిన వ్యాపారి

● ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు

పలాస/రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వ్యాపారి కోరాడ శ్రీనివాసరావు కంబిరిగాం రోడ్డులో ఉన్న తన స్థలానికి కంకరను అక్రమంగా తరలించి చదును చేయించుకున్నాడు. ఈ వ్యవహారంపై మైనింగ్ అధికారులు పరిశీలించి ఆ వ్యాపారికి నోటీసులు పంపించేందుకు రెవెన్యూ అధికారుల సాయం తీసుకున్నారు. దీంతో చినంచల, కేదారిపురం, లక్ష్మీపురం వీఆర్‌వోలు చంద్రమౌళి, వెంకటేశ్వరరావు, వెంకటరమణ తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తి ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం ఆ వ్యాపారి కోరాడ శ్రీనివాసరావుకు నోటీసులు ఇచ్చేందుకు అతడి నివాసానికి వెళ్లారు. ఆ సమయంలో శ్రీనివాసరావు లేకపోవడంతో అతడి భార్యకు విషయం తెలియజేశారు. దీంతో ఆమె తన భర్త శ్రీనివాసరావుకు ఫోన్‌చేసి విషయం చెప్పింది. దీంతో వీఆర్వోలపై శ్రీనివాసరావు దుర్భాషలాడుతూ చిందులు తొక్కాడు. అనంతరం వీఆర్వోలంతా కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తికి విషయం చెప్పగా.. ఇదే సమయంలో ఆ వ్యాపారి అక్కడికి చేరుకుని వీఆర్వోలతోపాటు తహసీల్దార్‌ను కూడా తీవ్ర పదజాలంతో దూషించాడు. తమపై వ్యాపారి శ్రీనివాస్ దుర్భాషలాడడంతో పాటు కులం పేరుతో దూషించాడని వీఆర్‌వోలు ఆరోపించారు. అనంతరం కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌కు చేరుకొని ఎస్ఐ నర్సింహమూర్తికి ఫిర్యాదు చేశారు. ఇదిలావుంటే తన ఇంటి మహిళలపై వీఆర్‌వోలు దుర్భాషలాడారంటూ ఆ వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేయడం విశేషం.

ఈ సందర్భంగా వీఆర్‌వో సంఘ జిల్లా అధ్యక్షుడు కొర్ల శ్రావణకుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. వీఆర్‌వోలపై దాడికి దిగడం సరికాదని, తమకు న్యాయం జరగకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వ్యాపారస్తుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. నోటీలు ఇచ్చేందుకు వచ్చిన వీఆర్వోలు తన భార్య వద్ద నూటిపోటి మాట్లాడారని ఆరోపించారు.

టెక్కలిలో చేర్చడం హర్షణీయం

నందిగాం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పలాస డివిజన్ నుంచి నందిగాం మండలాన్ని వేరుచేసి టెక్కలి డివిజన్‌లో కలుపుతూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని టీడీపీ మండల అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్ పినకాన అజయ్‌కుమార్, తెంబూరు పీఏసీఎస్ చైర్మన్ పోలాకి చంద్రశేఖరరావు అన్నారు. మంత్రి మండలి ఉపసంఘ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలపడం ద్వారా నందిగాం మండలానికి స్వేచ్ఛ లభించినట్లు అయిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో నందిగాం మండలాన్ని పలాస డివిజన్‌లో చేర్చడం ద్వారా మండల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. తిరిగి మండలాన్ని టెక్కలి డివిజన్‌లో చేర్చి టెక్కలి నియోజకవర్గం అంతా ఒకే డివిజన్‌లో ఉంచడం ద్వారా నందిగాం మండలానికి ఉపశమనం కలిగినట్లయిందన్నారు. వీరితో ఎం.బాలకృష్ణ, ఎస్.జానకిరాం, కె.సతీష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విచారణ అధికారిని మార్చాలి

టెక్కలి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏలో అవినీతి, అక్రమ బదిలీలు, నిధులు దుర్వినియోగంపై దళిత ఆదివాసీలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ అధికారిగా వ్యవహరిస్తున్న ట్రైకార్ ఎండీని తక్షణమే మార్చాలని దళిత ప్రజా సంఘాల నాయకులు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐటీడీఏలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని, తాము ఫిర్యాదు చేయడం జరిగిందని, అక్రమాలకు పాల్పడినవారిని ఎలా కాపాడాలో అనే వ్యూహరచనలో ఈ విచారణ వాయిదా వేశారని, ఆయన్ను తప్పించి మరో అధికారితో విచారణ చేపట్టాలని కోరారు. బాలికల పాఠశాలలో పురుష ఉపాధ్యాయుల నియామకం ఎలా చేపట్టారని జేఏసీ నాయకులు బి.గణేష్ కేఎన్‌పీఎస్ నాయకులు రాకోటి రాంబాబు, డీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కోత ధర్మారావు, అంబేడ్కర్ చైర్ సాధన సమితి కన్వీనర్ టి.రమణ ప్రశ్నించారు.

ఆధునిక విధానాలు అనుసరించాలి

పాతపట్నం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆధునిక విధానాలను అవలంబిస్తే వేగవతంమైన ఆర్థిక ఎదుగుదల సాధించవచ్చునని ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు డా.మంచు కరుణాకర్ తెలిపారు. సీది గ్రామంలో బుధవారం నిర్వహించిన రైతన్నా నీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. దూడలకు డీవార్మింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. సిబ్బంది రామ్మోహనరావు, గుణాలమ్మ, పాడి రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పలాస, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ గెస్ట్ అధ్యాపక ఎం దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ 55 శాతానికి పైగా మార్కులు కలిగి ఉండాలని, వాటితోపాటు నెట్, ఏపీసెట్, పీహెచ్‌డీ వంటి అదనపు అర్హతలు ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 29న డెమో, ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

నందిగాం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలం బడబందలో నూతనంగా ఏర్పాటుచేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. రాష్ట్ర బహుజన చెతన్య కళామండలి వ్యవస్థాపక అధ్యక్షులు ఉదయభాస్కర్, జిల్లా దళిత మహాసభ అధ్యక్షుడు బోకర నారాయణరావులు అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విగ్రహదాత యడ్ల గోపి, మోహనరావు, గోపీనాథ్, గిరిజన నాయకులు వాబ యోగి, జె.శ్రీనివాసరావు, యువజన ప్రతినిధులు పాల్గొన్నారు.

వెంకన్నకు పూజలు



కోటబొమ్మాళి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దంత గ్రామంలో గల వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం పందిరరాట భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ధ్వజస్తంభం ప్రతిష్ఠ, చివరిరోజు శుక్రవారం స్వామి వారి కల్యాణం జరుగుతుందని భక్తులందరూ పాల్గొని

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంతబొమ్మాళి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నౌపడ సబ్‌స్టేషన్ రూరల్ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఆ శాఖా టెక్కలి ఈఈ నరిసింహకుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూరల్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు కారణంగా సెలగపేట, మర్రిపాడు, రామేశ్వరం, భావనపాడు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలి పివేయనున్నట్టు తెలిపారు.

● కోటబొమ్మాళి: నిమ్మాడ విద్యుత్ ఉప కేంద్రం మరమ్మతులు చేపట్టనుండడంతో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు టెక్కలి ఈఈ నరసిం హకుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో నిమ్మాడ, చిన్నబమ్మిడి, పెద్దబమ్మిడి, వాండ్రాడ, ఎత్తురాళ్లపాడు, గట్లపాడు, తులసిపేట, చవితిపేట, చిట్టివలస, హరిశ్చంద్రపురం, రాజపురం, నర్సింగపల్లి, వెంకటాపురం, పంతులపేట తదితర గ్రామాలకు, పరిశ్రమ లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

● పోలాకి: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 28వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయ నున్నట్టు ఆ శాఖ టెక్కలి ఈఈ నరసింహకుమార్, ఏఈఈ విశ్వేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పిన్నింటిపేట సబ్‌స్టేషన్ పరిరిధిలోని 11కేవీ ఫీడర్‌లో మరమ్మతు పనులు చేపట్టనుండడంతో పిన్నింటిపేట, దండులక్ష్మీపురం, సుసరాం, బెలమరతో పాటు ఆ పరిధిలో ఉన్న ఆక్వా సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

● హిరమండలం: హిరమండలం, ఎల్ఎన్ పేట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఈనెల 28న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టెక్కలి డిజిన్ సంబంధిత శాఖ ఈఈ ఇ.నరసింహకుమార్ చెప్పారు. ఈ రెండు కేంద్రాల పరిధిలోని విద్యుత్ లైన్లు నిర్వహణ, చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. అందువల్ల ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

● సరుబుజ్జిలి: రొట్టవలస విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటన లో తెలిపారు. రొట్టవలస 11 కేవీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా చెట్ల కొమ్మలు తొలగించడం తదితర పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఆరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు చిన్నపాలెం, పెద్దపాలెం, రావివలస, పాలవలస, పెద్ద వెంకటాపురం, పురుషోత్తపురం, సీతారాంనగర్, అలమాజీపేట, పకీర్‌సాహెబ్‌పేట, చెవ్వాకులపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

● ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం, ఈదుపురం, కొళిగాం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిదిలో విద్యుత్ మెంటినెన్స్ మరమ్మతులు చేపట్టనుండడంతో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ యజ్ఞేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మునిసిపాల్టీ పరిధిలో 23వార్డులతో పాటు రూరల్ ఏరియాలో 21 పంచాయతీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.